
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 23 । నవంబర్ । 2023



సోమశిలలో 29.28 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 29.280 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 166 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,470
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రాము)	రూ.5,700
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,871
నవర (8 గ్రాములు)	రూ.46,968

గరిష్టం/కనిష్టం
29.8 /23.8

వాతావరణం

గాలిలో తేమ 93 శాతంగా బుధవారం నమోదైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు గురువారం కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నలుగురు ఉపాధ్యాయులకు చార్జ్ మెమోలు

కందుకూరు రూరల్: కందుకూరు డివిజన్లో నలుగురు ఉపాధ్యాయులకు చార్జ్ మెమోలను విద్యాశాఖ ఉన్నతాధికారులు జారీ చేశారని డిప్యూటీ ఈఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర పాఠశాల ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల తనిఖీలను ఈ నెల 18న చేపట్టిన విషయం తెలిసిందే.

- గుడ్లూరు మండలం నరసాపురం ప్రాథమిక పాఠశాలలో 4, 5వ తరగతుల విద్యార్థులతో వర్క్ బుక్స్‌ను పూర్తి చేయించకపోవడంతో ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు.. వర్క్ బుక్స్‌ను పరిశీలించని కారణంగా చినలాటరపి హైస్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మికి చార్జ్ మెమోలను జారీ చేశారన్నారు.
- మొగిలిచర్ల హైస్కూల్లో ఆరో తరగతి విద్యార్థులతో నోట్ బుక్స్‌ను రాయించకపోవడంతో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు రమేష్.. లింగసముద్రం మండలం గంగపాళెం ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి విద్యార్థులతో వర్క్ బుక్స్‌ను పూర్తి చేయించని కారణంగా ఉపాధ్యాయుడు లక్ష్మయ్యకు చార్జ్ మెమోను జారీ చేశారని పేర్కొన్నారు.

దళిత డప్పుల మేళా ప్రారంభం



కళాకారుల డప్పు ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో జగనన్న దళిత డప్పుల మేళాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రజాజ్యోతి చైతన్య కళావేదిక ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. డప్పుల విన్యాసాలు, జానపద, పౌరాణిక పద్యనాటకాలను ప్రదర్శించారు. బాలనాగమ్మ, సత్యహరిశ్చంద్ర నాటకాలను సీనియర్ కళాకారులు ప్రదర్శించి సభికుల హర్షధ్వానాలను అందుకున్నారు. సీనియర్ కళాకారిణి రేబాల శ్రీలక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక విభాగ జిల్లా అధ్యక్షుడు బాబు, సమాచార, పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు, ప్రజాచైతన్య కళావేదిక అధ్యక్షురాలు రమణశ్రీ, జీవనజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మందా వెంకట్రావ్, ప్రజాజ్యోతి చైతన్య కళావేదిక అధ్యక్షులు రమణశ్రీ, జిల్లా కార్యదర్శులు వెంకటాద్రి, సింహాద్రి, కామాక్షి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అధికారులు

కోవూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలని కేంద్ర ప్రభుత్వ యూత్ స్పోర్ట్స్ డైరెక్టర్ బంగార్రాజు పేర్కొన్నారు. పడుగుపాడు పంచాయతీలో డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, అధికారులతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివారెడ్డి మాట్లాడారు. వీక్షిత్ భారత్.. సంకల్ప భారత్ యాత్రను ఈ నెల 26 నుంచి జనవరి 26 వరకు నిర్వహించనున్నారని వెల్లడించారు. ప్రతి పంచాయతీకి ఓ వాహనం వస్తుందని, దీని ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నారని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని కోరారు. ఎంఈఓలు చెంచులక్ష్మి, రహీం, ఏఓ ఇందిరావతి, డాక్టర్ ఇర్ఫాన్, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, ఏపీఎం వెంకటస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే వేగవంతం



మాట్లాడుతున్న మలోల

రాపూరు: మండలంలో జరుగుతున్న భూ సర్వేను వేగవంతం చేయాలని నెల్లూరు ఆర్డీఓ మలోల పేర్కొన్నారు. మండలంలో జరుగుతున్న భూ సర్వేను బుధవారం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. 13 గ్రామాల్లో భూ సర్వే జరుగుతోందని, తొమ్మిది గ్రామాల్లో తుది దశలో ఉందని చెప్పారు. గిలకపాడు, రావిగుంటపల్లిలో రీ సర్వేను ప్రారంభించామన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

- బస్తాకు నెలకు రూ.1 మాత్రమే వసూలు
- రైతుల పంట ఉత్పత్తుల నిల్వకు నూతన విధానం
- మార్కెటింగ్ శాఖ పరిధిలోని గోడౌన్లు అన్నదాతలకే కేటాయింపు
- జిల్లాలో 57,650 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు



కందుకూరు మార్కెట్ యార్డులో అందుబాటులో ఉన్న గోడౌన్లు



కే గోడౌన్

రైతులకు అండగా నిలిచేందుకు మార్కెటింగ్ శాఖ వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశం లేక ఇబ్బందులు పడిన రైతులకు గోడౌన్ సదుపాయాన్ని కల్పించడమే లక్ష్యంగా ముందుకొచ్చింది. తమ పరిధిలోని గోడౌన్లలో నెలకు రూపాయి నామమాత్రపు అద్దెతో పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. జిల్లాలో ఇతర శాఖలకు కేటాయించిన గోడౌన్లను సైతం రైతులకే ఉపయోగపడేలా చర్యలు చేపడుతున్నారు.

కందుకూరు: రైతు సంక్షేమమే లక్ష్యంగా ఎన్నో చర్యలు చేపట్టిన ప్రభుత్వం తాజాగా మరో వినూత్న నిర్ణయం తీసుకుంది. తాము పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు వీలుగా అన్నదాతలకు మార్కెటింగ్ శాఖ గోడౌన్లను కేటాయించనున్నారు. బస్తాకు కేవలం రూపాయి చొప్పున నెలకు వసూలు చేయనున్నారు.

ఇదీ ఇప్పటి వరకు పరిస్థితి..

పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశం రైతులకు వారి ఇళ్ల వద్ద ఉండదు. దీంతో పంట చేతికొచ్చిన వెంటనే ఆ రోజు మార్కెట్ ధర ఎంత ఉంటే అంతకు కల్లాల్లోనే అమ్ముకోవడం పరిపాటి. దీంతో మార్కెట్ ధర తక్కువగా ఉన్న సమయంలో రైతులు నష్టపోవడమే కాకుండా దళారుల బెడదా అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు పండించిన పంట ఉత్పత్తులను కొంత కాలం నిల్వ చేసుకొని, అధిక ధరలు ఉన్నప్పుడు విక్రయించేలా మార్కెటింగ్ శాఖ ఆలోచన చేసింది.

ఆర్నెల్ల పాటు భద్రపర్చుకోవచ్చు..

రైతులు తమ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలోని గోడౌన్లను కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. అదీ బస్తాకు నెలకు రూపాయి అద్దెనే వసూలు చేయనున్నారు. ఈ విధంగా ఆర్నెల్ల పాటు సమీపంలోని మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉన్న గోడౌన్లలో తమ ఉత్పత్తులను భద్రపర్చుకోవచ్చు. అవసరమైతే రైతుల విజ్ఞప్తి మేరకు మరో రెండు నెలల పాటు అవకాశాన్ని కల్పించనున్నారు.

ఉత్పత్తులు పాడవకుండా చర్యలు

నిల్వ చేసిన ఉత్పత్తులు పాడవకుండా.. పురుగులు పట్టకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలను మార్కెటింగ్ శాఖ చేపట్టనుంది. జిల్లాలోని 8 మార్కెట్ కమిటీల పరిధిలో 57,650 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. వీటిలో 26,950 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్లను వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయ్స్ వంటి అనుబంధ శాఖలు వినియోగించుకుంటున్నాయి. వీటి పరిధిలో ప్రస్తుతం పది వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్లలో రైతులు ధాన్యాన్ని నిల్వ చేసుకొని ఉన్నారు. ఇవి పోను 30 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు ప్రస్తుతం మార్కెటింగ్ శాఖ వద్ద ఖాళీగా ఉన్నాయి. వీటిని రైతులకు కేటాయించేందుకు ఆ శాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

లాభాలొస్తాయని అంచనా..

ప్రస్తుతం రైతులు తమ పొలాల్లోనే పంట ఉత్పత్తులను విక్రయించే సంప్రదాయం కొనసాగుతోంది. మార్కెట్ యార్డులు అందుబాటులో ఉన్నా, అక్కడికి పంట ఉత్పత్తులు రావడంలేదు. ఈ నేపథ్యంలో మార్కెట్ యార్డులను రెగ్యులేటింగ్ మార్కెట్ యార్డులుగా మార్చేందుకు యత్నాలు జరుగుతున్నాయి. మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తులను విక్రయించడం ద్వారా దళారీ వ్యవస్థ కనుమరుగై.. రైతులకు అధిక లాభాలొస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

అధునాతన సదుపాయాలు

యార్డులకు తీసుకొచ్చిన పంట ఉత్పత్తులను ఆరబెట్టుకునేందుకు అవసరమైన సదుపాయాలను మార్కెటింగ్ శాఖ కల్పిస్తోంది. రైతులకు అవసరమైన పట్టలు.. ఎలక్ట్రానిక్ కాటాలతో పాటు మౌలిక వసతులను కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. నిల్వ చేసిన పంట ఉత్పత్తుల విక్రయంలో సహాయ సహకారాలను అందిస్తారు. దేశవ్యాప్తంగా మార్కెటింగ్ శాఖతో సంబంధమున్న 20 వేల మంది వ్యాపారులను దీనికి అనుసంధానం చేస్తున్నారు. మిల్లర్లు, కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో జిల్లా స్థాయి అధికారులు చర్చించి గోడౌన్లలో నిల్వ ఉన్న ఉత్పత్తులను కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టనున్నారు.

అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తాం



రైతులు అన్ని రకాల పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గోడౌన్లను కేటాయిస్తాం. పంట ఉత్పత్తులను ఆరబెట్టుకోవడంతో పాటు కాటా సదుపాయాలనూ కల్పిస్తాం. వ్యాపారులతో అనుసంధానం చేసి.. నిల్వ చేసిన ఉత్పత్తులను మంచి ధరకు విక్రయించేలా చర్యలు చేపడతాం. నామమాత్రపు అద్దెకే గోడౌన్లను ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాసులు, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ

ఆహ్లాదకరంగా నగరవనం

- ఒంగోలు డీఎఫ్‌ఓ శ్రీనివాసులు



నగరవనంలో ప్రకాశం డీఎఫ్‌ఓ శ్రీనివాసులు తదితరులు

నెల్లూరు(బారకాసు): నగరంలోని పొదలకూరు రోడ్డులో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో తీర్చిదిద్దుతున్న నగరవనం ఆహ్లాదకరంగా ఉందని ప్రకాశం డీఎఫ్‌ఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరవనాన్ని ప్రకాశం డీఎఫ్‌ఓ తన బృందంతో కలిసి బుధవారం సందర్శించారు. వాకింగ్ ట్రాక్, చిన్నారులు ఆడుకునేందుకు ప్రత్యేకంగా పార్కు, అందులోని ఆట వస్తువులు, ఔషధ మొక్కల వనాలు తదితరాలను పరిశీలించారు. వీటికి సంబంధించిన పలు విషయాలను నెల్లూరు జిల్లా అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్ తెలియజేశారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడారు. ఇక్కడి నగరవనం తరహాలో ప్రకాశం జిల్లాలోనూ ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నామని చెప్పారు. నెల్లూరు రేంజర్ మాల్యాద్రి పాల్గొన్నారు.

కండలేరులో నీటి నిల్వ



రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 11.142 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 40, పిన్నేరువాగు, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు ఐదు క్యూసెక్కుల చొప్పున, లోలెవల్ స్లూయిజ్‌కు వంద క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

సమస్యలకు ఎక్కడికక్కడే పరిష్కారం



అర్జీని స్వీకరిస్తున్న హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్
- ఉదయగిరిలో 'జగనన్నకు చెబుదాం'

ఉదయగిరి: సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించాలనే లక్ష్యంతో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఉదయగిరిలోని టీటీడీ కల్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వివిధ సమస్యలపై 130 మంది అర్జీలను సమర్పించారు. ఇంటి స్థలాలు, అసైన్‌మెంట్, డీ – ఫారం పట్టాలు, పింఛన్లు, రేషన్ కార్డుల మంజూరు తదితరాలపై అర్జీలు అందాయి.

- దుత్తలూరు – సీతారామపురం జాతీయ రహదారి నిర్మాణంలో భూములు, భవనాలు కోల్పోతున్న వారికి పరిహారాన్ని పెంచాలని పలువురు కోరారు.
- ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్ వినతిపత్రాన్ని సమర్పించారు.
- ఉదయగిరి – బండగానిపల్లి ఘాట్ రోడ్డు నిర్మాణంలో అటవీ అనుమతులు త్వరగా లభించేలా చూడాలని కొండ కింది ప్రాంతాల ప్రజలు కోరారు.
- ఉదయగిరిని జిల్లా చేయాలని జిల్లా సాధన సమితి అధ్యక్షుడు వేణుగోపాల్ కోరారు. జేసీ కూర్మనాథ్, ఆర్డీఓ మధులత, హౌసింగ్, డ్వామా పీడీలు నాగరాజు, వెంకట్రావు, జిల్లా సర్వే అధికారి హనుమాన్‌ప్రసాద్, నుడా వీసీ బాపిరెడ్డి, జిల్లా వ్యవసాయ, మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖల జేడీలు సత్యవాణి, నాగేశ్వరరావు, మహేశ్వరుడు, డీఈఓ గంగాభవాని, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, డీటీ షాజిహా పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ విధుల్లో ట్రెయినీ డీఎస్పీ

నెల్లూరు(క్రైమ్): శిక్షణలో భాగంగా ట్రెయినీ డీఎస్పీ హేమలత నగరంలోని వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు చేపట్టారు. వారం పాటు ఆమె విధులు నిర్వర్తించనున్నారు. మదనపల్లికి చెందిన హేమలత 2023 బ్యాచ్ డీఎస్పీ. అనంతపురం పీటీసీలో శిక్షణ అనంతరం ప్రాక్టికల్ ట్రెయినింగ్ నిమిత్తం జిల్లాకు కేటాయించారు. కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ విధుల వరకు ఆర్నెల్ల పాటు శిక్షణ పొందనున్నారు. ఇందులో భాగంగా చిన్నబజార్ పోలీస్‌స్టేషన్లో వారం పాటు కానిస్టేబుల్ విధులు నిర్వర్తించారు. వృత్తిపరమైన వివిధ అంశాలను స్థానిక ఇన్‌స్పెక్టర్ నారాయణ ఆమెకు వివరించారు.



భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- సమీక్ష సమావేశంలో మంత్రి కాకాణి

నెల్లూరు (దర్గామిట్ట): రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికలతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ముఖ్య శాఖల అధికారులతో కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఈ నెల 24, 25వ తేదీల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సంబంధిత అధికారులు అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని పేర్కొన్నారు. బలహీనంగా ఉన్న చెరువు.. కాలువ కట్టల విషయంలో శ్రద్ధ వహించాలని సూచించారు. బలహీనంగా ఉన్న కల్వర్టుల వద్ద తగిన బందోబస్తును ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, పోలీస్ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం.. అవసరమైన వసతులతో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. జేసీ కూర్మనాథ్, కమిషనర్ వికాస్ మర్మత్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, ఏఎస్పీ హిమవతి, డీఆర్వో లవన్న, వ్యవసాయ శాఖ జేడీ సత్యవతి, ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, నెల్లూరు, కావలి ఆర్డీఓలు మలోల, శీనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలకు చెక్

జిల్లాలోని రహదారులు రక్తమోడుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడుతుండగా.. మరెందరో క్షతగాత్రులవుతున్నారు. ఈ నేపథ్యంలో నివారణపై జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రమాదాలు అధికంగా జరుగుతున్న రహదారులు, ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు, బ్యారికేడ్లు, రేడియం స్టిక్కర్లు, ఇసుక డ్రమ్ములు, విద్యుద్దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

- రహదారులపై బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు
- భద్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



మనుబోలు – వెంకటాచలం పరిధిలో బ్లాక్ స్పాట్లను పరిశీలించి సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని జాతీయ రహదారులపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే దీనికి తగిన విధంగా ఏర్పాట్లు పెద్దగా లేవు. వాస్తవానికి జాతీయ రహదారి సంస్థ, హైవే పోలీసులు నిత్యం పెట్రోలింగ్ చేయాల్సి ఉంది. నిబంధనల మేరకు జాతీయ రహదారులపై వాహనాలను నిలపకూడదు. ఒక వేళ వాహనాలు మరమ్మతులకు గురైతే వెంటనే రోడ్డుపై నుంచి పక్కకు తొలగించి దాని చుట్టూ విద్యుద్దీపాలు, సూచికలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే బ్లాక్ స్పాట్ల వద్ద కనీస చర్యలు చేపట్టకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఈ నేపథ్యంలో రహదారులపై ప్రమాదాల నివారణకు ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు.

అనుక్షణం.. అప్రమత్తం

రహదారులపై ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి ఇసుక డ్రమ్ములు, బ్యారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. సైన్ బోర్డులతో పాటు రహదారుల మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లు, సోలార్ విద్యుద్దీపాలను ఏర్పాటు చేస్తూ వాహనదారులను అనుక్షణం అప్రమత్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల రహదారులు దెబ్బతినడంతో వాటికి మరమ్మతులు చేయిస్తున్నారు. రహదారులను ఎస్పీ స్వయంగా పరిశీలించి ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సీఐలు, ఎస్సైలకు సూచనలు చేస్తున్నారు.

వాష్ అండ్ గో..

జాతీయ రహదారి వెంబడి హైవే పోలీసులతో నిరంతర గస్తీని నిర్వహిస్తున్నారు. వాహన తనిఖీలను ముమ్మరం చేయడంతో పాటు మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. నిద్రమత్తులో ఉన్న డ్రైవర్లను మేల్కొల్పేలా వాష్ అండ్ గో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

వాహనదారులకు మరింత అవగాహన

వాహనదారులకు మరింత అవగాహన కల్పించేలా జిగ్‌జాగ్‌గా ఉండే బ్యారికేడ్లతో పాటు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. చీకటి కారణంగా ప్రశాంతినగర్ వద్ద ప్రమాదాలు అధికంగా జరుగుతుండటంతో సోలార్ విద్యుద్దీపాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రమాదాల నివారణకు పోలీస్ అధికారులు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి.

పోస్టర్ల ఏర్పాటు

నగరంతో పాటు నగర పరిధిలోని జాతీయ రహదారి వెంబడి రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు.

- సౌత్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని బుజబుజనెల్లూరు, సుందరయ్యకాలనీ, గొలగమూడి క్రాస్‌రోడ్డు, మినీబైపాస్, ఓల్డ్ బైపాస్ ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఆయా రహదారుల్లో ఎన్ని ప్రమాదాలు జరిగాయి.. వీటికి గల కారణాలను విశ్లేషిస్తూ పోస్టర్లను ఏర్పాటు చేశారు.
- నార్త్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని జాతీయ రహదారి వెంబడి చింతారెడ్డిపాళెం క్రాస్ రోడ్డు, గ్రీన్ సిటీ, ఎన్టీఆర్‌నగర్, అల్లీపురం క్రాస్‌రోడ్డు, ప్రశాంతినగర్, భగత్‌సింగ్‌కాలనీ, మినీబైపాస్ మీదుగా ఆత్మకూరు బస్టాండు ఫ్లయ్‌ఓవర్, పెన్నా బ్రిడ్జి, వెంకటేశ్వరపురం ఫ్లయ్‌ఓవర్ వద్ద వేగ నియంత్రణ చర్యలు చేపట్టారు.



ప్రశాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరిక బోర్డు

భక్తిశ్రద్ధలతో పడిపూజ



శీవేలి ఉత్సవం

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో మండల పూజలను విశేషంగా నిర్వహిస్తున్నారు. అభిషేకాలు, హోమం, పూజలు, ఉత్సవాలు, సేవలు, మహాదీపారాధన, పడిపూజను విశేషంగా బుధవారం జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం, భిక్షను స్వీకరించారు. ఉభయకర్తలుగా ఉడతా చక్రవర్తి, నీరజ, మందిపాటి ఇందిరమ్మ, తిక్కవరపు శ్రీనివాసరెడ్డి, భ్రమ, చల్లా చైతన్యకుమార్‌రెడ్డి, శిరీషారెడ్డి వ్యవహరించారు. అయ్యప్ప సేవా సమాజ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, సభ్యులు శంకరన్, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.



పడిపూజ

పొదలకూరు
నిమ్మధరలు (కిలో)
పెద్దవి : రూ.45
సన్నవి : రూ.25
పండ్లు : రూ.8



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: రూ.85
లేయర్ (లైవ్)	: రూ.105
బ్రాయిలర్ చికెన్	: రూ.160
స్కిన్‌లెస్ చికెన్	: రూ.180
లేయర్ చికెన్	: రూ.178









వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం



బీమా కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమైందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని పడుగుపాడు చంద్రమౌళినగర్ గిరిజన కాలనీలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం మాట్లాడారు. రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పాలన ఒక స్వర్ణయుగమని, ఆయనకు మిన్నగా వైఎస్ జగన్ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రజలు అడగని పథకాలను కూడా ఈ ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో పడుగుపాడు ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. పడుగుపాడు వద్ద హైవే అభివృద్ధికి రూ.65 కోట్లను కేంద్రం విడుదల చేసిందన్నారు. పడుగుపాడులో సంక్షేమ పథకాల ద్వారా రూ.43 కోట్ల నిధులు లబ్ధిదారులకు అందిందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి దేశమంతా మన రాష్ట్రం వైపు చూస్తున్నాయన్నారు. గతంలో పేదవాడికి జబ్బు చేస్తే ఆస్తులు అమ్ముకుని వైద్యం చేయించుకునే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం అందుతోందన్నారు. అలాగే నాడు- నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయిందన్నారు. ఇటీవల ఐఏబీ సమావేశం తరువాత సాగునీరు అందించాలని సంగం వద్ద సాగునీటికి విడుదల చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా కార్డులను అందజేశారు. డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు, జెడ్పీటీసీ శ్రీలత, డీఏల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, పార్టీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : నియోజకవర్గ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని రెండో డివిజన్ గుడిపల్లిపాడులో రూ.55 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మరో కోటిన్నర నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్‌సీపీ లక్ష్యమని, అన్ని వర్గాల వారికి సంక్షేమ లబ్ధి చేకూరుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అవినీతికి తావులేకుండా ప్రజల వద్దకే సేవలు అందుతున్నాయన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరించాలన్నారు. మరలా సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయా ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించాలన్నారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వేబోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, కార్పొరేటర్‌లు రామ్మోహన్, నాగరాజు, పార్టీ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ఉప్పుటూరయ్య మృతదేహం

నెల్లూరు రూరల్ : విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఉప్పుటూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక వడ్డిపాళెంలో ఉంటున్న బెల్లంకొండ ఉప్పుటూరయ్య(51) వ్యవసాయ పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య పద్మమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తన ఇంటికి ఎదురుగా సోదరుడు విజయకుమార్ నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో విజయకుమార్ తన ఇంటి వద్ద అల్యూమినియం తీగలపై దుస్తులు ఆరేసే క్రమంలో షాక్‌కు గురై పెద్దగా కేకలు వేశాడు. వెంటనే ఇరుగుపొరుగు వారు అక్కడికి చేరుకుని కర్రలతో అతన్ని రక్షించారు. కాగా తమ్ముడి ఇంటి నుంచి కేకలు రావడంతో ఉప్పుటూరయ్య అక్కడికి చేరుకుని శ్లాబ్ కమ్ములకు ఉన్న తీగలను తొలగించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మరణించారు. దీనిపై సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడి కుటుంబ సభ్యులను విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

తాళం వేసిన ఇంట్లో నగల చోరీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని శాంతినగర్‌లో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో బంగారు నగలు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. శాంతినగర్‌లో పుట్టం రామ్‌కుమార్, దొరసానమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరు రెండు రోజుల క్రితం తిరుమలకు వెళ్లారు. తిరిగి బుధవారం ఇంటికి చేరుకోగా, మెయిన్ డోర్ ఓపెన్ చేసి ఉండటం గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని గుర్తించారు. వీటి విలువ రూ.1,70,000 ఉంటుందని బాధితులు తెలిపారు. ఈ విషయమై బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేంద్ర తెలిపారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

• ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

జలదంకి : పేదల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామవరప్పాడు పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లు అందజేశారు. గ్రామంలో రోడ్లు, ఇళ్లు కావాలని ప్రజలు కోరగా అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామంలో త్వరలో రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి హామీని అమలు చేసి ప్రజల గుండెల్లో దేవుడిగా నిలిచారని కొనియాడారు. 14 ఏళ్లు సీఎంగా చేసిన చంద్రబాబు ఎన్ని మోసాలు చేశాడో ప్రజలు గ్రహించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. గడప గడపలో వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మేదరమెట్ల శివలీల, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, ఎంపీడీఓ బి.సింగయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు రావి ప్రసాద్‌నాయుడు, గుర్రం జగ్గయ్య, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, తమ్మినేని సతీష్, బి.కృష్ణారెడ్డి, చేజర్ల హరిబాబురెడ్డి, వర్ధినేని మురళీ పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపు

• 112కు తల్లిదండ్రుల ఫిర్యాదు
• యువకుడిని రక్షించిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్) : తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో బాధిత తల్లిదండ్రులు డయల్ 112కు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిమిషాల వ్యవధిలోనే యువకుడిని కాపాడి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్లితే.. వేదాయపాళేనికి చెందిన ఓ యువకుడు బీబీఏ చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో తమలాగే ఉద్యోగం సాధించాలని కుమారుడికి చెబుతూ వచ్చారు. ఈ నేపథ్యంలోనే యువకుని ప్రేమ వ్యవహారం ఇంట్లో తెలిసింది. ఈ విషయమై మంగళవారం రాత్రి యువకుడ్ని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తల్లిదండ్రులు యువకుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. జాడ తెలియకపోవడంతో డయల్ 112కు ఫిర్యాదు చేశారు. ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్, సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వేమారెడ్డి నైట్‌బీట్ సిబ్బందిని, హైవే మొబైల్స్‌ను అప్రమత్తం చేశారు. రైల్వే ట్రాక్ వెంబడి గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా జాతీయ రహదారికి సమీపంలోని ఓ కళాశాల వద్ద యువకుడిని గుర్తించారు. తల్లిదండ్రులకు సమాచారం అందించి యువకుడిని వేదాయపాళెం పోలీసుస్టేషన్‌కు తరలించి అక్కడ తల్లిదండ్రులకు అప్పగించారు. ఇరువురికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సకాలంలో స్పందించి కుమారుడిని చెంతకు చేర్చిన పోలీసు అధికారులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నగదు స్వాహాపై ఫిర్యాదు

జలదంకి : స్థానిక వలంటీర్ సాధు ప్రసన్నకుమార్ ఆరుగురి వద్ద దాదాపు రూ.44 వేల నగదు స్వాహా చేశాడని బాధితులు బుధవారం జలదంకి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు.. ప్రసన్నకుమార్ వలంటీర్‌గా పనిచేస్తూ జలదంకిలో ఇంటర్‌నెట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. గ్రామంలోని ఆరుగురి వద్ద మీ వేలిముద్రలు అవసరమని చెప్పి పింఛన్ నగదు, రైతు భరోసా నగదు, అలాగే వారి అకౌంట్లలో ఉన్న నగదును స్వాహా చేశాడు. దీంతో వారు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసి, ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీఓ సింగయ్యకు వినతిపత్రం అందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంగం : సంగం కొండ దిగువన పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. సంగం అటవీ ప్రాంతంలో పేకాట స్థావరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై నాగార్జునరెడ్డి తన సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.6,500ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుళికలు తిని వ్యక్తి ఆత్మహత్య


సంగం : గుళికలు మందు తీసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగం తిరుమనతిప్ప ఎస్సీ కాలనీలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. సంగం తిరుమనతిప్పకు చెందిన యల్లంపల్లి రమణయ్య (46) స్థానికంగా కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. కొన్ని సంవత్సరాల క్రితం భార్యతో విడిపోయి తిరుమనతిప్ప ఎస్సీ కాలనీలో ధనమ్మను వివాహం చేసుకుని ఇక్కడే నివాసముంటున్నాడు. ప్రతినిత్యం పూటుగా మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం మద్యం తాగిన రమణయ్య గుళికల మందు తీసుకున్నాడు. అపస్మారకస్థితికి చేరుకోవడంతో గమనించిన భార్య, కుటుంబసభ్యులు ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. సంగం ఎస్సై నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


త్రిష

✻ సందర్భం

గతంలో ఎం.ఎల్.ఏ అయిన ఒక పెద్ద హీరో స్త్రీల గురించి అసభ్యంగా మాట్లాడి అసెంబ్లీలో సంజాయిషీ ఇచ్చాడు. డెబ్బయి ఏళ్లు దాటిన ఒక సీనియర్ నటుడు నోరు పారేసుకుని పరువు పోగొట్టుకున్నాడు. పార్లమెంట్ సభ్యుడుగా ఉన్న మరో నటుడు స్త్రీల దుస్తుల గురించి సుద్దులు చెప్పి నిరసన ఎదుర్కొన్నాడు. ఇప్పుడు తమిళ నటుడు మన్సూర్ అలీఖాన్. సెలబ్రిటీలుగా ఉన్నవారు ఎంతో బాధ్యతగా ఉండి యువతకు మార్గం చూపేలా ఉండాలి. వారు ఇలా తగలడితే స్త్రీలతో ఎలా వ్యవహరించాలో ఇంటినే బడిగా మార్చి తల్లిదండ్రులు నేర్పించాల్సి ఉంటుంది. అయితే ఇంటి ఆడవారికి తండ్రి, భర్త గౌరవం ఇచ్చి మాట్లాడుతున్నారా అనేది ప్రశ్న.

మగవారూ... భాష జాగ్రత్త


మన్సూర్ అలీఖాన్

అతడో ప్రసిద్ధ నటుడు. 'మా బ్లడ్డు వేరు మా బ్రీడు వేరు' అంటుంటాడు. కాని ఒక సభలో అభిమానులను చూసి పూనకం వచ్చి స్త్రీల గురించి అశ్లీలమైన వ్యాఖ్యలు చేశాడు. వందల సినిమాల్లో తండ్రిగానో బాబాయిగానో వేసిన ఒక నటుడు 'స్త్రీల మీద మీ అభిప్రాయం ఏమిటి?' అని సభలో యాంకర్ అడిగితే పరమ రోతగా సమాధానం ఇచ్చాడు. ఇక నటుడుగా, రియల్టర్‌గా గుర్తింపు పొందిన మరో పెద్ద మనిషి పార్లమెంట్ మెంబర్ అయ్యాక పార్లమెంట్‌లో నిలబడి మరీ 'స్త్రీల దుస్తుల వల్లే వారికి సమస్యలు వస్తున్నాయి' అన్నాడు.

స్త్రీలను ఏదో ఒకటి అనేయొచ్చు. అంటే వాళ్లు పడతారు, అనడానికే మేము పుట్టాము అనే చులకనభావం పురుష సమాజంలో నరనరాన జీర్ణించుకుని పోబట్టే ఈ ప్రతిఫలాలు. అదృష్టవశాత్తు ఇలాంటి వ్యాఖ్యలకు వెంటనే నిరసన పెల్లుబుకుతున్నా పురుషుల నోటి దురుసు తగ్గడం లేదు. తాజాగా తమిళ నటుడు మన్సూర్ అలీఖాన్ ఇటీవల త్రిషతో 'లియో' సినిమాలో నటించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ 'ఆమె హీరోయిన్ అని తెలిశాక (గత సినిమాల్లో తాను చేసిన) బెడ్‌రూమ్ సీన్ ఉంటుందని ఆశపడ్డాను' అని వ్యాఖ్యానించాడు. 'ఇది సినిమా లాంగ్వేజ్' అని మన్సూర్ అనుకుని ఉండొచ్చుగాని దానిలోని అశ్లీల ధ్వనికి త్రిష రియాక్ట్ అయ్యింది. 'ఇతనితో ఇంకెప్పుడూ సినిమాల్లో నటించను' అని చెప్పింది. ఆ తర్వాత చినికి చినికి గాలివానై ఇప్పుడు మన్సూర్ మీద కేసు బుక్ అయ్యేంతగా వెళ్లింది. మగవాళ్లు 'సరదాగా మాట్లాడుతున్నామని' అనుకుంటూ కూడా స్త్రీలను కించపరిచే వ్యాఖ్యలు చేస్తారు. సరదాగా కించపరచడం ఏమిటో... కించపరచడం ఎలాంటి సరదానో వీరే చెప్పాలి.

ప్రసిద్ధులే దారి తప్పితే

రాజకీయ నేతలు, సినిమా నటులు, క్రీడాకారులు, వ్యాపారవేత్తలు... ఇలా సమాజంలో గుర్తింపు పొందినవారు స్త్రీల పట్ల మరింత గౌరవంతో మెలగుతూ ఆదర్శంగా నిలవాలి. కాని చాలాసార్లు రాజకీయ నాయకుల దగ్గరి నుంచి అన్ని రకాల ప్రముఖులు ఏదో ఒక సందర్భంలో చులకన మాటలు మాట్లాడుతూ కుసంస్కారాన్ని ప్రదర్శిస్తున్నారు. ఉత్తరాదిలో మంత్రులు 'మేం వేసిన రోడ్లు ఫలానా హీరోయిన్ బుగ్గల్లా ఉంటాయి' అంటూ వదరుతుంటారు. సల్మాన్ ఖాన్ 'సుల్తాన్' సినిమాలో కుస్తీ వీరుడిగా నటించి 'ఈ సినిమాలో కుస్తీలు చేస్తే రేప్ జరిగినంత పనయ్యింది నాకు' అని వ్యాఖ్యానించి మొట్టికాయలు తిన్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ఒక మాజీ మంత్రి ప్రస్తుత మంత్రిగా ఉన్న నటిపై దారుణమైన వ్యాఖ్యలు చేసి కోర్టు కేసును ఎదుర్కొనబోతున్నాడు.

బాల్యం నుంచి భావజాల ప్రభావం

'కుటుంబంలో తండ్రి (మగాడు) ముఖ్యం' అనే భావన బాల్యం నుంచి పిల్లల్లో ఎక్కించడం ద్వారా పురుష సమాజం తన ఆధిక్యతను స్త్రీలపై ఆధిపత్యాన్ని కొనసాగించేలా చేస్తుంది. తండ్రిని 'మీరు' అని, తల్లిని 'నువ్వు' అని అనడంలో ప్రేమ, గౌరవం, దగ్గరితనం ఉన్నా 'నువ్వు' అనడం వల్ల 'లెక్క చేయవలసిన పని లేదు' అనే భావన కలిగితే కష్టం. తిట్లు, బూతులు అన్నీ స్త్రీలను అవమానించేవే. వాటిని విని, పలికి స్త్రీల పట్ల అలా మాట్లాడవచ్చు అనుకుంటారు మగవారు. ఇంట్లో చెల్లెని, అక్కని, తల్లిని తండ్రి అదుపు చేసే తీరు చూసి, తామూ బయట స్త్రీలను అలాగే అదుపు చేయవచ్చనుకుంటారు. ఫైటర్ జెట్స్‌ను స్త్రీలు నడుపుతున్న ఈ కాలంలో కూడా 'మేమేమీ గాజులు తొడుక్కోలేదు', 'మూతి మీద మీసముంటే రా'లాంటి పౌరుష వచనాలను పురుషులు ఇంకా పలికేటంత వెనుకబాటుతనంలో ఉండటం విషాదకరం. శారీరక పరిమితులు ఉన్నంత మాత్రాన స్త్రీలు బలహీనులు, పురుషులు బలవంతులు కాబోరు.

తల్లిదండ్రులూ జాగ్రత్త

అబ్బాయిలను ఆడపిల్లలను గౌరవించేలా పెంచడం, టీనేజ్‌లో ఉన్న అబ్బాయిలకు సరైన కౌన్సెలింగ్ ఇవ్వడం ఇప్పటి తల్లిదండ్రుల తక్షణ కర్తవ్యం. చట్టాలు పకడ్బందీగా ఉన్న ప్రస్తుత రోజుల్లో తెలిసో తెలియకో అహంకారంతోనో పరుష వ్యాఖ్య, అసభ్య చేష్ట నేరుగా కాని సోషల్ మీడియాలోగాని చేస్తే వారు ప్రమాదంలో పడతారని హెచ్చరించాలి. చైతన్యం పెరిగింది. అబ్బాయిలూ భాష జాగ్రత్త.

న్యూస్ మేకర్

ఫైనల్ మ్యాచ్‌లో మన జట్టు ఓటమి చెందిన బాధలో ఆమె పెద్దగా ఎవరికంటా పడలేదుగానీ... ఆ తరువాత మాత్రం 'ఎవరీ అమ్మాయి?' అనుకున్నారు చాలామంది. గెలుపు తరువాత ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు పక్కన ప్రముఖంగా కనిపించిన ఆ అమ్మాయి పేరు... ఊర్మిళా రోసారియో. ఎవరీ ఊర్మిళ?

అవును... మన అమ్మాయే!




తల్లిదండ్రులతో ఊర్మిళ


వన్స్ అపాన్ ఏ టైమ్... కుటుంబ సభ్యులతో... (కింది వరసలో మధ్యలో)

ఊర్మిళా రోసారియో ఆస్ట్రేలియన్ క్రికెట్ టీమ్ మేనేజర్. ఆమె తల్లిదండ్రులు ఐవీ, వాలెంటైన్ రోసారియోలది కర్ణాటకలోని మంగళూరుకు సమీపంలోని కిన్నిగోలి ప్రాంతం. ఐవీ, వాలంటైన్‌లు ఖతార్‌లోని దోహాలో ఉద్యోగం చేస్తున్న కాలంలో ఊర్మిళ జన్మించింది.

ఊర్మిళకు చిన్నప్పటి నుంచి ఆటలు అంటే చాలా ఇష్టం. స్కూలు రోజుల్లో క్రికెట్ కంటే బాస్కెట్‌బాల్, టెన్నిస్ బాగా ఆడేది. బంగీ జంపింగ్ అంటే ఇష్టం. ఖతార్ టెన్నిస్ ఫెడరేషన్‌లో మూడు సంవత్సరాలు పనిచేసింది.

కార్నెగీ మెలన్ యూనివర్శిటీలో బీబీఏ చేసిన ఊర్మిళ ఆ తరువాత ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టుకు మేనేజర్‌గా పనిచేసింది. ఒక నాన్–ఆస్ట్రేలియన్‌కు టీమ్ మేనేజర్ బాధ్యతలు అప్పగించడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. ఫుట్‌బాల్ ప్రపంచకప్ నేపథ్యంలో క్రికెట్ నుంచి కొన్ని నెలల పాటు విరామం తీసుకొని ఖతార్‌లో ఫుట్‌బాల్ స్టేడియం నిర్వాహణ బాధ్యతలు చూసుకుంది.

ఆ తరువాత మళ్లీ ఆస్ట్రేలియాకు వచ్చింది.

ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టు మేనేజర్‌గా ఊర్మిళ పనితీరు, హిందీ, కన్నడ, కొంకణి... మొదలైన భారతీయ భాషలలో నైపుణ్యం వరల్డ్‌కప్ టూర్‌లో ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు మేనేజర్‌గా ఎంపిక చేయడానికి కారణం అయింది.

ఏడు సంవత్సరాల క్రితం ఊర్మిళ తల్లిదండ్రులు దోహా నుంచి మన దేశానికి వచ్చారు. కాఫీ ఎస్టేట్ కొనుగోలు చేసి కర్ణాటకలోని సకలేష్‌పూర్‌లో స్థిరపడ్డారు.

'క్రికెట్‌తో ఒకప్పుడు నాకు పెద్దగా పరిచయం లేదు. అలాంటి నాకు క్రికెట్‌తో ఇంత అనుబంధం ఏర్పడడం ఆశ్చర్యంగా ఉంది' అని నవ్వుతూ అంటుంది ఊర్మిల.

నవ్వడం సరే,
క్రికెట్ టీమ్ మేనేజర్ అంటే మాటలా?

ఒక్కమాటలో
చెప్పాలంటే...
'రెస్పాన్సిబుల్ ఫర్ ఎవ్రీథింగ్'
దీనిలో వందకు వంద మార్కులు కొట్టేసింది ఊర్మిళ.

ఊర్మిళ గత మార్చిలో తల్లిదండ్రులను చూడడానికి మనదేశానికి వచ్చింది. ఊర్మిళ ఇక్కడ ఉంటే కాఫీ ఎస్టేట్‌లో చిన్న చిన్న పనులు కూడా చేస్తుంది. ఆమె పక్కన ఉంటే తల్లిదండ్రులకు పండగే. కూతురి ఉన్నతి గురించి పెద్దగా మాట్లాడకపోయినా 'ఫైనల్ మ్యాచ్ చూడడానికి అహ్మదాబాద్‌కు వెళ్లాలనుకున్నాం. దురదృష్టవశాత్తు మా ఎస్టేట్ దాటి వెళ్లలేకపోయాం' అంటున్నారు ఊర్మిళ తల్లిదండ్రులు.

ఫైనల్ మ్యాచ్ మిస్ అయితే ఏమిటి?
ఏదో ఒకరోజు కాఫీ ఎస్టేట్‌కు ఊర్మిళ వస్తుంది కదా!
ఆ మ్యాచ్‌ను కళ్లకు కడుతుంది కదా! ఇక దిగులెందుకు!!

ఈ వెడ్డూరం చూశారా!

వెడ్డింగ్ విత్ టికెట్!

కొంతమంది ఎంతోఘనంగా జరుపుకునే తమ పెళ్లి వేడుకల వీడియోలను అమ్ముకుంటూ డబ్బులు సంపాదించడం ఇప్పటి ట్రెండ్‌గా మారింది. ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు తమ పెళ్లి వీడియోలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరిలానే సెలబ్రిటీ హోదాలేని వారు సైతం విదేశీయులకు పెళ్లి టికెట్లు అమ్మి వెడ్డింగ్ పర్యాటకానికి తలుపులు తెరుస్తున్నారు.

భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. అందుకే చాలా మంది విదేశీయులు ఇక్కడి సంస్కృతిని తెలుసుకునేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. విదేశాలతో పోలిస్తే ఇండియాలో ఎంతో శాస్త్రోక్తంగా పెళ్లిళ్లు జరుగుతాయి. ఈ పెళ్లిళ్లను చూసేందుకు విదేశీయులు చాలా ఉత్సాహం చూపుతారు. పెళ్లి సంప్రదాయాలు, రకరకాల రుచికరమైన వంటకాలను టేస్ట్ చేసేందుకు తహ తహలాడుతుంటారు. అందుకే ఏ మాత్రం అవకాశం చిక్కినా వెంటనే వచ్చి ఇండియాలో వాలిపోతుంటారు. ఇందుకు ఎంత డబ్బు ఖర్చు పెట్టడానికైనా వెనుకాడరు. ఈ అభిరుచినే మన భారతీయ జంటలు, వెడ్డింగ్ ప్లానర్స్ సొమ్ము చేసుకుంటున్నారు. దీనికోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్లూ నడుపుతున్నారు. వెడ్డింగ్ ఇన్విటేషన్‌ను టికెట్‌గా చూపిస్తూ నిశ్చితార్థం నుంచి, మెహందీ, సంగీత్, హల్దీ ఇలా ఒక్కో వేడుకకి ఒక్కో రేటుని చెబుతూ పర్యాటకులను ఆకర్షిస్తున్నారని వెడ్డింగ్ ప్లానర్స్ చెబుతున్నారు.



జాయిన్ మై వెడ్డింగ్...

పెళ్లి చేసుకునే జంట సొంతంగా జాయిన్ మై వెడ్డింగ్ పేరుతో అకౌంట్‌ను క్రియేట్ చేస్తారు. ఈ వెబ్‌సైట్‌లో పెళ్లికొడుకు, పెళ్లికూతురు ఇద్దరి ఫోటోలు, పెళ్లి తేదీ, ఎన్నిరోజులు వేడుకలు జరుగుతాయి.. ఏ రోజు ఏ కార్యక్రమాలు నిర్వహిస్తారు... వంటి వివరాలను అప్‌లోడ్ చేస్తారు. పెళ్లిలో పెట్టే భోజనం వెజ్, నాన్‌వెజ్, మందు, చిందు ఉంటే అదీ చెబుతారు. ఇవేగాక డ్రెస్ కోడ్, అక్కడ మాట్లాడే భాష, వేడుక జరిగే ప్రదేశం అడ్రస్‌తోపాటు ఫోన్ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్‌ను ఇస్తారు. విదేశీ పర్యటనలో ఉన్న వారికి ఈ పెళ్లి తేదీలు జత కుదిరితే టికెట్స్ బుక్ చేసుకుని వచ్చేసి మరీ పెళ్లి బ్యాండ్ బాజా, బారాత్‌లను ఎంజాయ్ చేస్తున్నారు.

ఒక్కరోజుకి పన్నెండు వేలపైనే...

ఎంతో ఆడంబరంగా జరిగే మన వివాహ వేడుకలను చూడడానికి పర్యాటకులు రోజు కోసం 150 డాలర్ల టికెట్‌ను సంతోషంగా కొనేస్తున్నారు. మన రూపాయలలో పన్నెండు వేలకు పైనే. ఇక పెళ్లి పూర్తి తతంగం మొత్తం అంటే రెండు రోజులు చూడాలంటే 250 డాలర్లు చెల్లించాలి (రూ.20 వేలకుపైన). ఒకటీ, రెండూ కాదు ఐదు రోజుల పెళ్లి చూడాలంటే ప్రత్యేక వెడ్డింగ్ ప్యాకేజీ టికెట్ కొనాల్సిందే. ఇలా పదిమంది విదేశీ అతిథులు పెళ్లికి వచ్చారంటే పెళ్లిలో కొన్ని ఖర్చులకు సరిపడా డబ్బు సమకూడినట్లే! అందుకే ఎక్కువ మంది వెడ్డింగ్ టూరిజంపైన ఆసక్తి కనబరుస్తున్నారు.

తొలిసారి...

హంగేరియన్– ఆస్ట్రేలియన్ సంతతికి చెందిన ఒర్సి పర్కాణి తొలిసారి 2016లో 'జాయిన్ మై వెడ్డింగ్' పేరిట వెబ్‌సైట్‌ను క్రియేట్ చేసింది. అప్పుడు ఇది ఒక చిన్న స్టార్టప్. కానీ ఇప్పుడు ఇది ట్రెండ్‌గా మారింది. ఈ ఏడాది ఆగస్టు 19న పర్యాటక మంత్రిత్వ శాఖ వెడ్డింగ్ టూరిజంను ప్రారంభించింది. వెడ్డింగ్ టూరిజం ద్వారా భారతీయులేగాక, విదేశీయులు సైతం ఇక్కడికి వచ్చి ఇక్కడి సంప్రదాయాలకు తగ్గట్టుగా పెళ్లి వేడుకలు జరుపుకోవచ్చని చెబుతూ వెడ్డింగ్ టూరిజాన్ని ప్రోత్సహిస్తోంది. బీచ్ వెడ్డింగ్, నేచర్ వెడ్డింగ్, రాయల్ వెడ్డింగ్, హిమాలయన్ వెడ్డింగ్ థీమ్‌ల పేరిట ప్రచారం నిర్వహిస్తోంది. ఈ ట్రెండ్‌కు మంత్రిత్వ శాఖ ప్రోత్సాహం బూస్టర్‌గా పనిచేసి ఇండియాలో వెడ్డింగ్ వ్యాపారం వృద్ధిలోకి రాబోతుంది. ఇంకెందుకాలస్యం... మీ ఇంట్లో జరిగే పెళ్లివేడుకలకు వెడ్డింగ్ టూరిజంను జోడించి మరింత కలర్‌ఫుల్‌గా జరుపుకోండి.

సెర్మనీ గైడ్...

విదేశీయులను పెళ్లికి పిలవడమేగాక, వారికి అతిథి మర్యాదల్లో లోటు లేకుండా చూసుకోవడం ఈ వెడ్డింగ్ టూరిజం ప్రత్యేకత. వేడుక లో జరిగే ప్రతి విషయం, పర్యాటకులకు వచ్చే సందేహాలు నివృత్తి చేసేందుకు సెర్మనీ గైడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు." ప్రస్తుతం రాజస్థాన్, ఢిల్లీ, ముంబైలలో ఈ వెడ్డింగ్ టూరిజం పెరుగుతోంది. రాజస్థాన్‌లోని చిన్నటౌన్లలో జరిగే వేడుకలకు విదేశీయులు ఆసక్తి చూపుతున్నారు. జోధ్‌పూర్, జైపూర్, జైసల్మేర్, ఉదయ్‌పూర్‌లలో జరిగే రాయల్ ఇండియన్ వెడ్డింగ్స్‌కు డిమాండ్ ఇంకా ఎక్కువగా ఉంది" అని వెడ్డింగ్ ప్లానర్స్ చెబుతున్నారు.

బ్యూటిప్స్

ముడతలు మచ్చలు పోవాల్సిందే...



కళ్లకింద ఏర్పడిన నల్లటి వలయాలు, ముడతలు, మచ్చలు అందమైన ముఖారవిందాన్ని పాడుచేస్తాయి. ఈ చిట్కాలు పాటిస్తే మీ సమస్యకు పరిష్కారం దొరికినట్లే...



- రాత్రి పడుకునేముందు కొద్దిగా అలోవెరా జెల్‌ను తీసుకుని కళ్ల కింద రాసి మర్దన చేసి పడుకోవాలి. ఉదయాన్నే నీటితో కడిగేయాలి.
- విటమిన్ ఇ ఆయిల్ కొల్లాజెన్ బూస్టర్‌గా పనిచేసి కళ్లకింద రక్తప్రసరణ చక్కగా జరిగేందుకు తోడ్పడుతుంది. రాత్రి పడుకునే ముందు విటమిన్ ఇ ఆయిల్‌ను కళ్లకింద రాసి మర్దన చేయాలి.
- పై రెండూ అందుబాటులో లేని వారు కనీసం కొబ్బరి నూనెను అయినా కళ్లకింద రాసుకుని మర్దన చేసుకోవాలి. ఉదయాన్నే కడిగేయాలి.





ఈ మూడింటిలో ఏ ఒక్క చిట్కానైనా క్రమం తప్పకుండా పాటిస్తే కొద్దిరోజుల్లోనే ముడతలు, మచ్చలు పోయి ముఖారవిందం బాగుంటుంది.

గెలుపు దారి

వ్యాపారానికి సంబంధించిన ఐడియాలు ఏకాంతంగా కూర్చొని ఆలోచిస్తేనే వస్తాయి... అనే గ్యారెంటీ లేదు. వ్యాపార విజయాలు ఫలానా వయసుకు మాత్రమే పరిమితం... అనే నియమాలేవీ లేవు. నగలు అంటే బంగారమే... అనే శాసనం ఏదీ లేదు. ఇందుకు ఉదాహరణ ముంబైకి చెందిన హేమా సర్దా...

వెదురు నగల వెలుగుల్లో...

కొన్ని సంవత్సరాల క్రితం... దిల్లీలో జరిగిన హస్తకళల ప్రదర్శనకు హాజరైంది హేమా సర్దా. వినూత్నంగా కనిపించిన అస్సామీ బ్యాంబూ జ్యువెలరీని కొనుగోలు చేసింది. ఈ వెదురు నగలు తనకు ఎంతగా నచ్చాయంటే 65 సంవత్సరాల వయసులో 'బ్యాంబు అండ్ బంచ్' రూపంలో డైరెక్ట్–టు–కన్స్యూమర్(డీ2సీ) బ్రాండ్‌కు శ్రీకారం చుట్టేంతగా. అస్సాంలోని గిరిజనులు తయారు చేసిన అందమైన వెదురు నగలను తన బ్రాండ్ ద్వారా విక్రయిస్తుంది హేమ. మన దేశంలో జువెలరీ అంటే బంగారం, వెండి... అనే అభిప్రాయాన్ని తన బ్రాండ్ ద్వారా మార్చే ప్రయత్నం చేస్తోంది. బయటి ప్రపంచానికి అంతగా తెలియని వెదురు నగలను ప్రాచుర్యంలోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

రకరకాల ప్రాంతాలలో తమ ప్రాడక్ట్స్‌కు సంబంధించి ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసింది. మౌఖిక ప్రచారం ద్వారా వెదురు నగల అమ్మకాలు ఊపందుకున్నాయి.

పదిహేను వేలతో వ్యాపారం ప్రారంభించి తన బ్రాండ్‌ను లాభాల బాట పట్టించింది హేమ. వ్యాపార వృద్ధికి సోషల్ మీడియాను ప్రధాన వేదికగా మలుచుకుంది. తమ బ్రాండ్‌కు చెందిన వెదురు నగల చిత్రాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసేది. దీంతో ఎక్కడెక్కడి నుంచో ఆర్డర్లు రావడం మొదలైంది.

సంప్రదాయ వెదురు ఆభరణాలకు మోడ్రన్ ట్విస్ట్ ఇచ్చి కొనుగోలుదారులను ఆకట్టుకునేలా చేయడంలో హేమ విజయం సాధించింది. నాణ్యమైన వెదురును కొనుగోలు చేసి అస్సాంలోని ట్రైబల్ ఆర్టిస్ట్‌ల దగ్గరికి పంపుతుంది.

'అరవై అయిదు సంవత్సరాల వయసులో మార్కెట్ తీరుతెన్నులను గురించి తెలుసుకోవడం కష్టమే కావచ్చు. ఈ వయసులో అవసరమా అని కూడా అనిపించవచ్చు. అయితే నేను ఎప్పుడూ అలా అనుకోలేదు. కొన్నిసార్లు ప్రయాణమే పాఠాలు నేర్పుతుంది. నా విషయంలోనూ ఇదే జరిగింది. మొదట్లో మా బ్రాండ్ పెద్దగా సక్సెస్ కాలేదు. జరిగిన తప్పులను సవరించుకొని ముందుకు వెళ్లాను' అంటుంది హేమ.

కోడలు తాన్య సహాయంతో మార్కెట్ ప్లేస్‌లను లొకేట్ చేయడం నుంచి సోషల్ మీడియా మార్కెటింగ్, ఫొటోగ్రఫీ వరకు ఎన్నో విషయాలు నేర్చుకుంది హేమ.

'నాణ్యమైన నగల అలంకరణకు బంగారమే అక్కర్లేదు అని చెప్పడానికి బ్యాంబూ జువెలరీ ఉదాహరణ. డబ్బు సంపాదన కోసం ఈ వ్యాపారం ప్రారంభించలేదు. వినూత్నమైన కళను ప్రజలకు చేరువ చేయాలనేది నా ప్రయత్నం' అంటుంది హేమా సర్దా.


హేమా సర్దా

